నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 31 అక్టోబర్ 2023
www.ntnews.com

# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## ధర్మ యుద్ధం.. విజయం తథ్యం

**పురాణాల్లో ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు దేవతలు యజ్ఞాలు,యాగాలు,మంచి పనులు చేస్తుంటే రాక్షసులు వాటికి అడ్డుపడేవారు. రాజుల కాలంలో కూడా ఎన్నో యుద్ధాలు జరిగేవి. అద్భుతంగా ప్రజలకు సేవ చేస్తూ రాజ్యాలను ఏలుతున్న రాజులపై దుష్టశక్తులంతా ఏకమై కుట్రలతో ఆ రాజును ఓడించేందుకు ప్రయత్నించేవారు. కానీ విజయం ఎప్పుడూ ధర్మం వైపే ఉండేది. ఆలస్యమైనా ధర్మం, న్యాయం విజయం సాధించేవి. ధర్మయుద్ధం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది. తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్నది కూడా ధర్మయుద్ధమనే చెప్పవచ్చు.**

కేసీఆర్ లాంటి గొప్ప విజన్ ఉన్న నాయకుడు ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఒకవైపు ఉంటే, 70 ఏండ్లుగా దేశ అభివృద్ధిని మరిచి రాజకీయమే ఎజెండాగా ప్రజల ఆశలు ఆశయాలను విస్మరించిన రెండు జాతీయ పార్టీలు వాటి తోక పార్టీలు ఒకవైపు నిలిచాయి..ఈ ధర్మయుద్ధంలో గెలుపెవరిది..ధర్మం ఎవరిది? మోసం ఎవరిది..?



ధర్మం అంటే మంచికి సంకేతం..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పరిస్థితులు ఎట్లుంటుండే ఒకసారి బేరీజు వేసుకోవాలి. రైతు వ్యవసాయం చేయాలంటే ఎన్ని ఆటంకాలు..కరెంట్ ఉండదు, నీళ్లు ఉండవు, పండించిన కొద్దో గొప్ప పంటను కొనే దిక్కుండదు.ఎరువుల కోసం చెప్పులు లైన్లలో పెట్టి నిరీక్షించే పరిస్థితి. కరెంట్ అడిగితే కాల్చిచంపే దుస్థితి..కాంగ్రెస్ పాలనలో నెర్రెలుబారిన నేలలు, కాంట్రాక్టుల కక్కుర్తి, కమీషన్ల బాధ తప్ప రైతును పట్టించుకున్న పాపాన పోలేదు. కరెంట్ తీగల మీద బట్టలెండేసుకోండని ఒకనాయకుని మాట. వ్యవసాయం దండుగ అని మరో నాయకుని మాట. సుదీర్ఘకాలం ఉమ్మడి రాష్ట్రాన్ని ఏలిన నాయకులు తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారు. రాక్షసుల్లా ఈ ప్రాంతాన్ని ముప్పుతిప్పలు పెట్టారు..తెలంగాణ ప్రాంతంపై వివక్ష, నీళ్ల తరలింపు, నిధుల తరలింపు, హక్కుగా రావాల్సిన వాటా ఇవ్వకుండా తెలంగాణను ఆగం చేసిన్రు కాంగ్రెస్ పార్టీ నాయకులు.

**కేసీఆర్ నాయకత్వంలో ఉవ్వెత్తున సాగిన ఉద్యమం, తెలంగాణ ప్రజల ధిక్కారం వెరసి స్వరాష్ట్ర కల సాకారమైంది. ప్రజల ఆకాంక్షలు నెరవేరటానికి యుగానికొక్కడు పుడుతుంటాడు. తెలంగాణను బాగు చేయటానికి ఈ యుగంలో పుట్టిన నాయకుడు కేసీఆర్.**

ఏం చేసిండు కేసీఆర్? ఎందుకు మనం ఆయనను గెలిపించాలి? ప్రతి ప్రశ్నకు ప్రజల్లోనుంచే సమాధానం వస్తున్నది. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధిపొందిన ప్రజలే బీఆర్ఎస్‌కు స్టార్ క్యాంపెయినర్లు. వారే రేపు కేసీఆర్‌ను గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఇంత అభిమానం ప్రజల్లో ఉండటానికి కారణం లేకపోలేదు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆయన రూపొందించిన పథకాలు దేశానికే తలమానికంగా నిలిచాయనటంలో అతిశయోక్తి లేదు. కొన్ని కార్యక్రమాలు కేసీఆర్ మానవతా కోణాన్ని, ఆలోచనా విధానాన్ని, ప్రజలపట్ల ఆయనకున్న కమిట్‌మెంట్‌ను చాటి చెప్పాయి. ఆడబిడ్డకు మేనమామగా కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ముసలవ్వల ఆత్మగౌరవం పెంచుతూ రెండువేల పింఛను, వికలాంగులకు పింఛన్లు, రైతన్నలకు వ్యవసాయాన్ని పండుగ చేస్తూ రైతుబంధు, రైతుబీమా, ఇంటింటికి మిషన్ భగీరథ నల్లా నీళ్లు ఇస్తున్నారు.

ఇలాంటి గొప్ప కార్యక్రమాలెన్నో అద్భుతంగా అమలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమంలో నెంబర్ వన్‌గా నిలిపారు. అన్ని వర్గాల ప్రజలకు లాభం జరిగేలా పథకాల రూపకల్పన అమలు తీరు ప్రజల్లో కేసీఆర్‌కు మరింత ఆదరణను తెచ్చిపెట్టింది. ప్రభుత్వ దవాఖానలు, పాఠశాలల బలోపేతం, కొత్త బడులు, దవాఖానల నిర్మాణంతో పేదలకు వైద్యం, విద్యను చేరువ చేశారు కేసీఆర్. మొదటి టర్మ్‌లో వ్యవసాయం, సాగునీరు, తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చి విజయం సాధించారు. రెండవటర్మ్‌లో వైద్యం, విద్య ను అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఈ అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే కేసీఆర్ మళ్లీ తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించాలి. అప్పుడే తెలంగాణ పునర్నిర్మాణం సంపూర్ణమవుతుంది.

**కేసీఆర్ ఉద్యమం, పునర్నిర్మాణంలో ధర్మం వైపు నిలబడ్డారు. చేసేది చెప్పారు. చెప్పిందే చేస్తున్నారు. ఇచ్చిన హామీలనే కాదు ఇవ్వని హామీలు కూడా పూర్తి చేసి చూపిస్తున్నారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి ఏంటో దేశాన్నడిగితే చెబుతుంది.మ్యానిఫెస్టో రూపకల్పన సైతం అద్భు తంగా చేశారు కేసీఆర్. ఏది చేయగలమో అది మాత్రమే చెప్పారు.**

**కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అంటూ కొత్త రాగం అందుకున్నది. 60 ఏండ్లు ఈ ప్రాంతాన్ని పాలించి ఆగం చేసిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందని ప్రజలెలా నమ్ముతారు. పారదర్శకత లేని గ్యారెంటీలతో ఆశపెడ్తే మోస పోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం అసాధ్యం. మ్యానిఫెస్టో రూపొందిస్తే ఆచరణ సాధ్యమయ్యేదిగా ఉండాలి.**



**తెలంగాణ విజయ్**
94919 98702

గత ఎన్నికల్లో కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను దాదాపు మొత్తం పూర్తి చేసిండు. కానీ ఈ కాంగ్రెస్ పార్టీ నోటికి ఏదివస్తే అది హామీ ఇచ్చి కర్ణాటకలో నాలుకకరుచుకున్నది. ఆ ప్రాంత రైతులను కాంగ్రెస్ మోసం చేస్తే ఇక్కడ కొచ్చి పోరాడుతున్నరు.

**కాంగ్రెస్‌ను నమ్మవద్దంటూ కర్ణాటకలో తమకు జరిగిన అన్యాయాన్ని ఇక్కడి ప్రజలకు వివరిస్తున్నారు.కాంగ్రెస్ గతంలో ప్రజలను ఎలా మోసం చేసిందో తెలియనిది కాదు. వారి స్కాములు యావత్ దేశం చూసింది. అలాంటి స్కాముల కాంగ్రెస్ వైపు ఉంటారా? అభివృద్ధి చేసే బీఆర్ఎస్ వైపు ఉంటారా ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి.**

కేసీఆర్ ఉద్యమం, పునర్నిర్మాణంలో ధర్మం వైపు నిలబడ్డారు. చేసేది చెప్పారు. చెప్పిందే చేస్తున్నారు. ఇచ్చిన హామీలనే కాదు ఇవ్వని హామీలు కూడా పూర్తి చేసి చూపిస్తున్నారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి ఏంటో దేశాన్నడిగితే చెప్తుంది. మ్యానిఫెస్టో రూపకల్పన సైతం అద్భుతంగా చేశారు కేసీఆర్. ఏది చేయగలమో అది మాత్రమే చెప్పారు. కాంగ్రెస్, బీజేపీల్లాగా మోసపూరిత హామీలను ఇవ్వలేదు. పింఛన్లు దశలవారీగా పెంపు నిజాయితీతో కూడిన ప్రకటన. రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఒక విప్లవాత్మక నిర్ణయం, గ్యాస్ సబ్సిడీ ఆడబిడ్డలకు మంచి కానుక. అన్నింటికి మించి ప్రతి కుటుంబానికి బీమా, పేదల ఆరోగ్యం కోసం రూపొందించిన కార్యక్రమాలు పేదల గడప గడపకు చేరాయి. ఎలాగూ గెలువలేమని కాంగ్రెస్, బీజేపీలు నోటికి ఏది వస్తే అది చెప్పి ప్రజలను మభ్య పెట్టజూస్తున్నాయి. కానీ ప్రజలేం అమాయకులు కారు.

కేసీఆర్ తెలంగాణ ఆత్మ. తన జన్మను తెలంగాణకు అంకితం చేసిన యుగపురుషుడాయన..తెలంగాణ చరిత్ర చెప్పాల్సి వస్తే కేసీఆర్‌కు ముందు తర్వాత అని చెప్పవచ్చు. తెలంగాణను ఆయనలా ఎవరూ ప్రేమించలేరు. ఎవరెన్ని విమర్శలు చేసినా ఎన్నికల రూపంలో జరుగుతున్న ఈ ధర్మయుద్ధంలో అంతిమ విజయం న్యాయం వైపు, ధర్మం వైపు నిల్చున్న కేసీఆర్, బీఆర్ఎస్‌దే. కుట్రలు,కుతంత్రాలు, అసత్యాలు ఎప్పటికి విజయం సాధించలేవు. ఇది ధర్మయుద్ధం. కేసీఆర్ విజయం తథ్యం.

---



## గురుతర బాధ్యతతో గురుకులాలు

**కేసీఆర్ అంటే ఒక ఉద్యమకారుడు, ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు. ఆయనను మరోకోణం నుంచి చూస్తే ఒక మానవతా మూర్తి కనిపిస్తారు. ఆయనది మానవీయ కోణం. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రవేశపెట్టే ఏ పథకమైనా మానవతా దృక్పథంతో కూడుకుని ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల మ్యానిఫెస్టోలో కేసీఆర్ ప్రకటించిన పథకాలన్నీ కూడా ఆయనలోని మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి.**

ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమం అని బయలుదేరినప్పుడు 'గీ బక్కపలుచనోడు ఏం జేత్తడు తీయ్, గాయనతోని ఏమైతది' అనుకున్నవాళ్లే. కానీ వారందరి ఆలోచనలకు చెంప పెట్టులా అనుకున్నది సాధించి పెట్టిండు. ఇయ్యాల మన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిండు. తెలంగాణ వచ్చాక ప్రతి ఒక్కరూ కులాలకు అతీతంగా లబ్ధి పొందేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత బాపు కేసీఆర్‌ది.

మనది వ్యవసాయం, కులవృత్తుల మీద ఆధారపడిన రాష్ట్రం. వలసపాలనలో వ్యవసాయం దండుగన్నారు. కులవృత్తులు నిరాదరణకు గురయ్యాయి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఒకటే ఆలోచించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే అన్నీ మెరుగుపడాలి. ముఖ్యంగా విద్యావిధానం మెరుగుపడాలనే ఆలోచన చేశారు. అందుకోసం అందరికీ విద్య అందాలని సంకల్పించారు. అన్ని కులాల నిరుపేదలకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించాలనే సంకల్పంతో గురుకుల విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గురుకులాల మాట దేవుడెరుగు. అసలు అలాంటివి రాష్ట్రంలో ఉన్నాయనే విషయమే చాలామందికి తెలియదు. అందరికీ తెలిసినవి రెండే రెండు అవి సర్కారు బళ్లు, లేకుంటే ప్రైవేట్ బళ్లు. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రంలో గురుకులాలు ఎక్కడో ఒకటి రెండు తప్ప పెద్దగా లేవు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో 291 గురుకులాలు మాత్రమే ఉండేవి. అయితే స్వరాష్ట్రంలో గురుకులాలను అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ వాటి సంఖ్యను దశల వారీగా పెంచుతూ రావటంతో నేడు రాష్ట్రంలో 1,005 గురుకులాలకు చేరాయి. ఇందుకోసం రూ.30 వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసింది. గురుకులాల్లోని ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షలు వెచ్చిస్తున్నది. ఈ లెక్కన తెలంగాణలో 6.5 లక్షల మంది విద్యార్థులు గురుకులాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. దీనివల్ల విద్యార్థుల తల్లితండ్రులకు ఆర్థిక భారం తగ్గుతున్నది.

ఈరోజుల్లో తల్లిదండ్రులకు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అన్ని కులాల్లోనూ పేదలున్నట్టే అగ్రవర్ణాల్లోనూ చాలామంది పేదలున్నారు. వారు తమ పిల్లల్ని చదివించాలంటే కత్తిమీద సాముగానే ఉంటుంది. తల్లితండ్రులకు గుదిబండగా మారిన కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనేది కేసీఆర్ సంకల్పం. ఆ సంకల్పంతోనే కేసీఆర్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలను పదింతలకు పెంచిండ్రు. తద్వారా ప్రతి నిరుపేద బిడ్డకు చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు కేసీఆర్. ఇన్నాళ్లు బీసీ కులాల వరకే పరిమితమైన గురుకులాలను అగ్రవర్ణ పేదలకు కూడా అందుబాటులోకి తెస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. ఇది చారిత్రత్మక నిర్ణయమనే చెప్పాలి.

పేరుకే అగ్రవర్ణాలైనప్పటికీ వారిలోనూ రోజు పని చేసుకుంటే తప్ప పూట గడవని పేద కుటుంబాలు అనేకం ఉన్నాయి. పేరుకు పెద్ద ఊరికి దిబ్బ అన్నట్టు ఉంది చాలామంది ఓసీల పరిస్థితి. పిల్లల్ని చదివించే స్థోమత లేక ఏమి చేయాలో తెలియక అప్పులపాలవుతున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. సరస్వతి పుత్రులైనా చదవలేని పరిస్థితి. ఈ పరిస్థితిని గుర్తించిన కేసీఆర్ ఈ టర్మ్‌లో అగ్రవర్ణాలకు గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తద్వారా అగ్రవర్ణ పేదలకు గురుకులాలు అందుబాటులోకి రానున్నాయి. దీనిద్వారా చాలామంది పేదలు నాణ్యమైన విద్యను పొందే అవకాశం లభిస్తుంది. ఇది ఆచరణలోకి వస్తే ఎంతోమంది అగ్రకులాల నిరుపేదలు లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ఈ ఆలోచన రావడం కేసీఆర్ మానవీయతకు అద్దం పడుతున్నది. ఈ ప్రకటనను అగ్రవర్ణ ప్రజలు హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఓసీ బిడ్డలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అగ్రవర్ణ నిరుపేద బిడ్డలకూ ఒక్క రూపాయి ఖర్చులేకుండా చదువుకునే సౌకర్యం కల్పించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నారు.




**మూల విజయారెడ్డి**
95283 66666

---

## బీజేపీతో బీసీలకు ఒరిగిందేమిటి?

**తెలంగాణలో ఎన్నికల ప్రచారం జోరుగా నడుస్తున్నది. పార్టీలన్నీ ప్రచార పర్వంలో దూసుకుపోతున్నాయి. అందులో భాగంగా బీజేపీ కొత్తరాగం ఎత్తుకున్నది. అది తమ పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని. ఆ పార్టీ అగ్ర నాయకుడు అమిత్ షా ఈ విషయాన్ని ప్రకటించారు. అయితే ఈ ప్రకటనపై తెలంగాణ సమాజం, మేధావి వర్గం ఆలోచించాల్సిన విషయం ఏంటంటే, దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న ఏ ఒక్క రాష్టంలోనూ బీసీ నాయకున్ని సీఎం చేస్తామని ప్రకటించలేదు. అలాంటిది తెలంగాణలో చేయడమంటే కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే తప్ప మరొకటి కాదని స్పష్టమవుతున్నది.**

తెలంగాణతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగుతున్నాయి. అక్కడ లేని బీసీ నినాదం తెలంగాణలో రావడానికి వెనుకాల పెద్ద కుట్ర ఉన్నది. తెలంగాణలో మెజారిటీ జనాభా బీసీలదే. సుమారు 54 శాతంతో బీసీలదే తెలంగాణలో పై చేయి. కాబట్టి , బీసీ వర్గా ల్లో సానుభూతి కోసమే ఈ రాగం ఎత్తుకున్నదని బహిర్గతమవుతున్నది. బీసీ ముఖ్యమంత్రిని చేస్తారు సరే. బీసీ నాయకులైన బండి సంజయ్, ఈటెల రాజేందర్, లక్ష్మణ్, ధర్మపురి అరవింద్, రాజాసింగ్‌లలో ఎవరినో ఒకరిని సీఎం అభ్యర్థిగా ప్రకటించే సాహసం చేయగలదా? బీజేపీ. మొన్నటికి మొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌ను పదవినుంచి తొలగించి, కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన బీజేపీ బీసీ నేతను సీఎం చేస్తానంటే ఎవరు నమ్ముతారు? ఏదో పండుగ ముందు అలికినట్టు ఎన్నికల ముందు ఇలాంటి నిర్ణయం తీసుకుంటే తెలంగాణ సమాజం నమ్మే పరిస్థితిలో లేదనేది బీజేపీ నాయకులు గుర్తించాలి.



తెలంగాణ రాష్ట్రంలో బీసీలదే అగ్రస్థానం. రాష్ట్రం ఏర్పడక ముందు గత ప్రభుత్వ పాలకుల చేతిలో అత్యధికంగా నలిగిపోయింది బీసీ కులస్థులే. అలాంటిది 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి నాళ్లలోనే సకలజనుల సర్వే అని ఒక బృహత్తర కార్యక్రమం తీసుకొని వారి జనాభాకు తగినట్టు పథకాలు రూపొందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. సర్వ సంపదలను సృష్టించే వృత్తి పనులన్నీ బీసీ కులాల చేతుల్లోనే ఉన్నాయి. రాజకీయ పార్టీలు తమ తమ రాజకీయాల కోసం బీసీలను వాడుకున్నాయి. కానీ వారి అవసరాలను గుర్తించలేదు.

వలస పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణ గ్రామీణ వ్యవస్థ చిన్నా భిన్నమైంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పాలన పగ్గాలు చేతుల్లోకి తీసుకున్నారు ఉద్యమ నేత కేసీఆర్. తెలంగాణ గ్రామీణ వ్యవస్థను, స్వభావాన్ని వృత్తి పనివారలతో సన్నిహిత సంబంధమున్న కేసీఆర్ పాలకుడుగా మెజారిటీ ప్రజల అవసరాలను గుర్తించారు. ఇంతవరకు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ బీసీ సమాజాన్ని హృదయం నిండా నింపుకున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బాగు చేయకుండా తెలంగాణ ప్రగతి సాధ్యం కాదని అర్థం చేసుకున్నారు. అందుకే గ్రామంలో ప్రధాన వృత్తి అయిన వ్యవసాయంతో పాటు కుల వృత్తులను ప్రోత్సహించారు. తద్వారా వారి ఆదాయమార్గాలను పెంచడమే ప్రధాన విషయంగా భావించారు. అందుకే వివిధ వృత్తుల వారు వారి పనులు చేసుకుని బతుకడానికి వీలుగా వసతులు కల్పించడం, పరికరాలను అందించటం చేశారు.

**వ్యవసాయాన్ని లాభసాటి చేయటానికి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రైతుబంధు, పెట్టుబడి సాయం, పంటల మార్పిడి, గిట్టుబాటు ధర, కోటి ఎకరాలకు నీటి వసతి తదితర కార్యక్రమాలను చేపట్టారు. వ్యవసాయ సంబంధిత పథకాల వల్ల గ్రామ బీసీ ప్రజలంతా లబ్ధిపొందే అవకాశమున్నది.**

అంతేకాకుండా గ్రామాల్లో వ్యవసాయం లాభసాటిగా ఉంటే తత్సంబంధిత కూలి పనులు దొరికి ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. ఇలా గ్రామ ఆర్థిక వ్యవస్థ, బీసీ వర్గాలు బాగుపడటానికి, మెజారిటీ ప్రజలకు ఆదాయ మార్గాలు లభించడానికి వ్యవసాయం లాభసాటిగా మారడానికి తెలంగాణ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతున్నది. దీనివల్ల వ్యవసాయం ప్రధాన వృత్తిగల కాపులతో పాటు భూములున్న అన్ని కులాలు లాభపడుతున్నాయి.



**జి. రాజేష్ నాయక్**
96035 79115

అలాగే గొల్ల కుర్మ కులవృత్తి సంబంధమైన గొర్రెలు, మేకలు పెంచుకొని బతుకడానికి లక్షలాది కుటుంబాలకు గొర్రెలు ఇచ్చింది ప్రభుత్వం. క్షీర విప్లవాన్ని ప్రోత్సహించడానికి కులాలకతీతంగా బర్రెలు, ఆవులు కూడా ఉచితం గా పంపిణీ చేసి బతుకు దెరువును చూపుతున్నది. చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ముదిరాజ్, గంగపుత్రులకు ఆసరాగా ఉంటున్నది. చేపల పరిశ్రమను అభివృద్ధి చేసింది. చేనేత వృత్తిని ప్రోత్సహించటం కోసం టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తూ పద్మశాలీలను ఆదుకుంటున్నది. అలాగే గౌడవృత్తి, ఇతర వృత్తులవారికి అండదండగా నిలుస్తున్నది. వృత్తి పనులు చేసుకునే వారంతా దాదాపు బీసీలే. ఇలా అతిముఖ్య ఆదాయవనరులైన వృత్తిపనులను ప్రోత్సహిస్తూ బీసీల ఆదాయ మార్గాలను పెంచే దిశగా ఏ బీజేపీ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నది. వృత్తి పనులకు పునరుజ్జీవనం కలిగిస్తున్నది.

కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసే సోయి లేని బీజేపీ తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రి చేస్తామనే వాదన పస లేనిదని తెలంగాణ ప్రజలు పసిగట్టారు. ఈ బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు లేరనే సంగతి బీజేపీ గుర్తెరుగాలి.


---

## బీఆర్ఎస్‌కు ఓటెందుకు వేయాలంటే?

**ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కొట్లాడి సాధించుకున్న తెలంగాణను తొమ్మిదేండ్లలోనే దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. సబ్బండ వర్గాల ఐకమత్యమే అండ దండలుగా మలచుకొని గెలిచి నిలిచిన నిలువెత్తు విజేత తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖరరావు. ఆయన నేతృత్వంలో తెలంగాణ రాష్టం అన్ని రంగాల్లోనూ గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే తిరిగి బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి తీసుకు రావలసిన అవసరం ఉన్నది.**

అనేక సమస్యలతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రాన్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ నేడు దేశంలోనే అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్దారు కేసీఆర్. రాష్ట్రం వచ్చేనాటికి అత్యవసరమైన జఠిలమైన కరెంటు సమస్యను పరిష్కరించి నేడు 24 గంటల కరెంటు ఇస్తున్న ఒకే ఒక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్. మనిషి మనుగడకు అవసరమైన మంచి నీటిని మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ అందించే కార్యక్రమాన్ని అనతికాలంలోనే పూర్తి చేశారు. మిషన్ కాకతీయతో వ్యవసాయానికి అవసరమైన గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేసి నీటి వనరులను పెంచారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయ మార్కెట్లు ఆధునీకరించటంతో పాటు గ్రామగామాన రైతు వేదికలు నిర్మించారు.

వ్యవసాయం దండుగ అన్న ఉమ్మడి పాలకుల నోర్లు మూతపడేలా వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది. రైతులకు పెట్టుబడి కోసం రైతుబంధు, ఎరువులు, రైతుబీమాలతో పాటు 24 గంటల కరెంట్ ఇచ్చి వ్యవసాయాన్ని స్థిరీకరించారు. రైతులకే భూముల మీద అధికారం ఉండేలా ధరణిని తీసుకొచ్చి భూ హక్కులను కల్పించారు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు, గీత కార్మికులకు, బోదకాలు, కిడ్నీ బాధితులకు, వికలాంగులకు ఆసరా పింఛన్లు ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపారు. పూజారులు, ఇమామ్‌లు, మౌజంలకు గౌరవ వేతనం అందించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌నే. ఉమ్మడి పాలనలో శంకుస్థాపనలకే పరిమితమైన ప్రాజెక్టుల మీద దృష్టి సారించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుగా గుర్తింపు తీసుకొచ్చారు. తెలంగాణలో నలువైపులా అన్నపూర్ణ సాగర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్లతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారు.



చేప పిల్లల ఉచిత పంపిణీతో నీలి విప్లవాన్ని తీసుకొచ్చి గంగపుత్రులు, ముదిరాజుల ఆదాయాన్ని పెంచారు. గొల్ల కుర్మలకు గొర్లను పంచి స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించి వారి జీవితాల్లో ఆనందాలు పంచారు. మైనారిటీలకు 204 గురుకులాలు ఏర్పాటు చేసి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దటంలో ముందు చూపుతో వ్యవహరించారు సీఎం. ఆడబిడ్డల పెండ్లిల కోసం కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్‌లను ప్రవేశపెట్టి లక్షా నూట పదహార్లు అందిస్తున్న మేనమామ మన కేసీఆర్. ఉండటానికి గూడు లేని నిరుపేదల కోసం డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించి వారి కండ్లల్లో ఆనందం నింపిన గొప్ప మానవతా మూర్తి ముఖ్యమంత్రి కేసీఆర్.

అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ కార్యాలయాలు, పోలీస్ కమీషనరేట్ కార్యాలయాలు నిర్మించి పాలనా వ్యవస్థను గ్రామీణ ప్రజలకు చేరువ చేశారు. వైద్యారోగ్యాన్ని ప్రోత్సహించడానికి 33 జిల్లాలకు మెడికల్ కాలేజీలు మంజూరు చేయడంతో పాటు బస్తీ, గ్రామీణ దవాఖానలను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ, అంగన్వాడీ, సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించి వారిలో ఆనందం నింపారు. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీ అయ్యే వారికి కేసీఆర్ కిట్లు అందిస్తున్నారు. తెలంగాణను ఐటీ హబ్‌గా మార్చి వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అంబేద్కర్ సచివాలయం, అమరుల స్థూపం, అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారు కేసీఆర్.



**రుస్తుం మహ్మద్**
94403 95537

**రైతులకు పెట్టుబడి కోసం రైతుబంధు, ఎరువులు, రైతుబీమాలతో పాటు 24 గంటల కరెంట్ ఇచ్చి వ్యవసాయాన్ని స్థిరీకరించారు. రైతులకే భూముల మీద అధికారం ఉండేలా ధరణిని తీసుకొచ్చి భూ హక్కులను కల్పించారు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు, గీత కార్మికులకు, బోదకాలు, కిడ్నీ బాధితులకు, వికలాంగులకు ఆసరా పింఛన్లు ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపారు.**

ఇట్లా ఒక్కరని కాదు, ఒక్కటని కాదు అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని మతాలు అన్ని రకాలుగా లబ్ధి పొందేలా సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారు. ప్రభుత్వం నుంచి ఏదో ఒక విషయంలో సాయం పొందని వ్యక్తి తెలంగాణలో లేరంటే అతిశయోక్తికాదు. అందుకే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవలసిన అవసరం, గురుతర బాధ్యత మనసున్న ప్రతి తెలంగాణ ఓటరుపై ఉన్నది.